# సాక్షి సిద్దిపేట

మంగళవారం : 14, మార్చి, 2023






## గుట్టలన్నీ తోడేస్తున్నారు

మట్టిదందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అక్రమార్కులు కొండపాక మండలంలోని గుట్టలను తోడేస్తూ వెంచర్లకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

8లో..





## దారిదోపిడీ

ఐదుగురు దొంగలు దారి దోపిడీకి పాల్పడ్డారు. సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర సామగ్రితో వెళ్తున్న డీసీఎం డ్రైవర్‌ను తుపాకీతో బెదిరించి సామగ్రిని ఎత్తుకెళ్లారు.

8లో..



## కోహెడ అభివృద్ధికి సహకరించాలి

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి కోహెడ మండల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు.

9లో..

# ఇంటర్ పరీక్షలకు అంతా సిద్ధం

**ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు**

- జిల్లాలో 41 పరీక్షా కేంద్రాలు
- 22,622 మంది విద్యార్థులు
- అమలులో ఒక్క నిమిషం నిబంధన
- రేపటి నుంచి ఎగ్జామ్స్ షురూ..



పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న దృశ్యం

**సిద్దిపేటఎడ్యుకేషన్:** రేపటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు జిల్లా విద్యా శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కోవిడ్ మూలంగా గతేడాది 70 శాతం సిలబస్‌తోనే పరీక్షలు నిర్వహించగా ఈ విద్యా సంవత్సరం పూర్తి సిలబస్‌తో పరీక్షలు నిర్వహిస్తున్నారు. నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు(సీఎస్), డిపార్ట్‌మెంట్ ఆఫీసర్(డీఓ)లకు అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించేందుకు 14416 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచారు. రేపటి నుంచి ఫస్టియర్, 16వ తేదీ నుంచి సెకండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

### ఒక్కో కేంద్రానికి ఒక సీఎస్

ఈ పరీక్షల కోసం జిల్లాలో 20 ప్రభుత్వ, 06 ప్రభుత్వరంగ, 15 ప్రైవేట్ కళాశాలల్లో మొత్తం 41 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు ప్రతి కేంద్రానికి ఒక సీఎస్(చీఫ్ సూపరింటెండెంట్), డీఓ (డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్)తో పాటు అదనంగా 15 మంది ఏసీఎస్(అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్)ను చొప్పున నియమించారు. ప్రతీ కేంద్రానికి ఒక ఏఎన్ఎం ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు ఉంచనున్నారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో ఉండే జిరాక్స్ సెంటర్‌ను పరీక్ష పూర్తయేంతవరకు మూసివేయనున్నారు. ఈ పరీక్ష కేంద్రాల్లో జనరల్, ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో మొత్తం 22,622 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

### కమిటీల పర్యవేక్షణలో..

మాస్ కాపీయింగ్ లేకుండా పరీక్షలను నిర్వహించేందుకు కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఆర్‌జేడీ, డీఐఈఓలతో కూడిన హైపవర్ కమిటీ, డీఐఈఓ, ఒక ప్రిన్సిపాల్, ఒక జూనియర్ లెక్చరర్‌లతో కూడిన జిల్లా పరీక్షల కమిటీలు, తహసీల్దార్, ఎస్ఐ, జూనియర్ లెక్చరర్‌తో కూడిన రెండు ఫ్లైయింగ్, నలుగురు జూనియర్ లెక్చరర్లతో కూడిన రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. ప్రతీ 20 మంది విద్యార్థులకు ఒకరు చొప్పున సుమారు 1,130 మంది అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఇన్విజిలేటర్లుగా విధులను నిర్వహించనున్నారు. పరీక్షల కమిటీలు, స్క్వాడ్ బృందాలు పరీక్షల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నాయి.

### గంట ముందే చేరుకోవాలి

ఉదయం 9 గంటలకు పరీక్షలు ప్రారంభం అవుతాయి. ఒక్క నిమిషం నిబంధన అమల్లో ఉంటుంది. విద్యార్థులు ఉదయం 8 గంటల కల్లా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. 8.45కు వారిని వారి గదుల్లోకి పంపిస్తారు. 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్ అంటే ఉదయం 9గంటల వరకు విద్యార్థులను హాల్‌లోకి అనుమతిస్తారు. 9 దాటితే అనుమతి ఉండదు. పరీక్ష పూర్తయ్యేంత (మధ్యాహ్నం 12గంటలు) వరకు పరీక్ష హాల్ నుంచి బయటకు వెళ్లేందుకు అనుమతి ఉండదు. జిల్లా వ్యాప్తంగా 18 మంది రూట్ అధికారులు, 9 మంది కస్టోడియన్‌లతో మొత్తం 17 పోలీస్ స్టేషన్లలో ఒకేషనల్ ఒక సెట్టు, జనరల్‌కు సంబంధించి మూడు సెట్ల పరీక్షా పత్రాలను భద్రపరిచారు.

| జనరల్ విభాగంలో.. | |
|---|---|
| సంవత్సరం | విద్యార్థులు |
| ప్రథమ | 8,030 |
| ద్వితీయ | 8,316 |
| మొత్తం | 16,346 |
| **ఒకేషనల్ కోర్సుల్లో..** | |
| ప్రథమ | 3,136 |
| ద్వితీయ | 3,140 |
| మొత్తం | 6,276 |

### జిల్లా స్థాయిలో కంట్రోల్ రూం



విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆయా కళాశాలలతో పాటు ఆన్‌లైన్‌లోనూ హాల్‌టికెట్లను తీసుకోవచ్చు. ఆ హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం తప్పని సరికాదు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశాము. 9985128599 లేదా 9949330191 నంబర్లకు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. జిల్లా రిసెప్షన్, డిస్పాచ్ కేంద్ర కార్యాలయం గతంలో సంగారెడ్డిలో ఉండగా ఈ సారి కరీంనగర్‌కు మార్చారు. సీఎస్, డీఓలు ఈ విషయాన్ని గమనించి జవాబు పత్రాల బండిల్స్‌ను కరీంనగర్‌కు పోస్టు చేయాలి.

–సూర్యప్రకాశ్, పరీక్షల కమిటీ కన్వీనర్, జిల్లా ఇంటర్ విద్యాధికారి

### అమలులో 144 సెక్షన్



**సిద్దిపేటకమాన్:** పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ నిబంధనలు అమల్లో ఉంటుంది. రేపటి నుంచి ఏప్రిల్ 4 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 06 గంటల వరకు సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలి. 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడి ఉండకూడదు. పరీక్షలకు నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేశాం. పోలీసు స్టేషన్ నుంచి పరీక్షా పత్రం పరీక్ష కేంద్రానికి వెళ్లే సమయంలో కానిస్టేబుల్ తప్పనిసరిగా ఎస్కార్ట్ ఉండాలి.

–శ్వేత, సిద్దిపేట పోలీస్ కమిషనర్

## పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలి

**పోలీస్ కమిషనర్ శ్వేత**



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్వేత

**హుస్నాబాద్:** హుస్నాబాద్ డివిజన్ పోలీస్ అధికారులతో హుస్నాబాద్ సర్కిల్ కార్యాలయంలో లాంగ్ పెండింగ్ కేసులు, హిస్టరీ షీట్స్, సిటీ కేసులపై పోలీస్ కమిషనర్ శ్వేత సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెలలో సాధ్యమైనంత వరకు అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను తగ్గించాలన్నారు. పూర్తి స్థాయిలో ఇన్వెస్టిగేషన్ చేసి డిస్పోజల్ చేయాలని సూచించారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో 60 రోజుల్లో ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. గంజాయి, పేకాట పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సమూలంగా నిర్మూలించాలన్నారు. ప్రతీ కేసులో ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలన్నారు. టార్గెట్ పెట్టుకొని పెండింగ్ కేసులను తగ్గించాలన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం విజుబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు, రాత్రి పెట్రోలింగ్ అధికారులు లాడ్జీలు, పాత నేరస్తులను తనిఖీ చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, హుస్నాబాద్ ఏసీపీ సతీష్, హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్, చేర్యాల సీఐ సత్యనారాయణ రెడ్డి, డివిజన్ ఎస్సైలు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### ఐఓసీ వద్ద జంక్షన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**సాక్షి ఎఫెక్ట్..**

**గజ్వేల్:** గజ్వేల్ పట్టణంలో జంక్షన్‌ల ఏర్పాటులో కొనసాగుతున్న నిర్లక్ష్యంపై 'సాక్షి'లో ఈనెల 3న 'నయా లుక్ ఇంకెప్పుడు..?'అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. ఈ క్రమంలోనే ఐఓసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) వద్ద నిర్మించనున్న తెలంగాణ అమరవీరుల స్తూపం జంక్షన్ స్థలాన్ని సోమవారం ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్ గుంటుకు శిరీషరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.35 లక్షల వ్యయంతో సరికొత్త హంగులతో ఈ జంక్షన్ ఏర్పాటు కాబోతున్నదని, త్వరలోనే పనుల ప్రారంభించనున్నట్లు వారు వెల్లడించారు.

### మల్లన్న బుకింగ్ ఆదాయం రూ.65.86 లక్షలు

**కొమురవెల్లి(సిద్దిపేట):** కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో ఆదివారం బుకింగ్ ఆదాయం రూ.65,86,147 రాగా.. సోమవారం మరో ఆరు లక్షల రూపాయల బుకింగ్ ఆదాయం వచ్చే అవకాశం ఉందని బుకింగ్ ఇన్‌చార్జి మాధవి తెలిపారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులు మొక్కుబడులుగా తలనీలాలు, పట్నాలు, బోనాలు, ఆర్జిత సేవలు నిర్వహించారు. ప్రత్యేక దర్శనాలు, ప్రసాద విక్రయాలు, వసతి గదుల అద్దె తదితర వాటి ద్వార శనివారం రూ.4,18,303, ఆదివారం రూ.61,67,844 ఆదాయ వచ్చిందన్నారు. గతేడాది 8వ వారం వచ్చిన ఆదాయ కంటే ఈ సారి రూ.17 లక్షలు అధికంగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. బుకింగ్ ఆదాయం పెరగడంతో ఈఓ బాలాజీ హర్షం వ్యక్తం చేశారు.

### మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** తొలి కవయిత్రి మొల్లమాంబ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని శాలివాహన (కుమ్మరి) సంఘం జిల్లా అధ్యక్షుడు దరిపల్లి శ్రీను డిమాండ్ చేశారు. మొల్లమాంబ జయంతిని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని ఆమె విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీను మాట్లాడుతూ తొలి తెలుగు మహిళ కవయిత్రి తెలుగులో రాసిన రామాయణం మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిందన్నారు. ఆమె శైలి చాలా సరళమైంది, రమణీయంగా ఉంటుందన్నారు. ఆమె కుమ్మరి కులంలో పుట్టినందుకు తమ కులానికి గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గోవిందారమ్ శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు నార్లపురం తిరుపతి, తరిగొప్పుల రామచంద్రం, నెల్లుట్ల కట్కూరి రవీందర్, పైలెట్ ప్రాజెక్ట్ కో ఇన్‌చార్జి మూడపల్లి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వర్కోల్ శ్రీనివాస్ , కోశాధికారి కొలిపాక సంపత్ , జిల్లా నాయకులు దరిపల్లి శ్రీనివాస్, దరిపల్లి నాగరాజ్, దరిపల్లి ప్రసన్న, శాతరాశి రాజు, దరిపల్లి యదగిరి, లింగం, నాంపల్లి, రాజు, దరిపల్లి శ్రీనివాస్, రేణికుంట రమేశ్, రేణికుంట రాము, రాధారం కృష్ణ, వర్కోల్ శ్రీనివాస్, యసరేని రమేశ్ పాల్గొన్నారు.

### నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సీఎంకు లేఖ

**అక్కన్నపేట(హుస్నాబాద్):** శ్రీరాంసాగర్ వరద కాలువ, గౌరవెల్లి రిజర్వాయర్ కింద ముంపునకు గురవుతున్న భూ నిర్వాసితులకు భూ నష్టపరిహారం,పెళ్లయిన యువతులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, మిగిలిన 84 ఎకరాలకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి లేఖ రాసినట్లు జిల్లా కార్యదర్శి మంద పవన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.పెళ్లయిన యువతులు రెండు నెలలుగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని దీక్షలు చేస్తున్నారన్నారు. గతంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ భూ నిర్వాసితులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించి ఇస్తానన్న హామీ నెరవేర్చలేదని తదితర విషయాలను ప్రస్తావిస్తూ సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారని ప్రకటనలో పేర్కొన్నారు.

# మత్తడి పోస్తున్న చెరువులు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

**ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు**

**సిద్దిపేటరూరల్:** ఈ యాసంగిలో పండిన పంటను కేంద్ర బీజేపీ కొన్నా.. కొనకపోయినా సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం కొంటుందని ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు రైతులకు ధీమా ఇచ్చారు. సోమవారం మండల పరిధిలోని ఇర్కోడ్ గ్రామంలో పెద్దమ్మ - పెద్దిరాజుల కల్యాణ మహోత్సవం, నారాయణరావుపేట మండల పరిధిలోని బంజేరుపల్లిలో జరుగుతున్న బీరప్పకామరతి కల్యాణ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి రైతులకు సాగు నీరు అందిస్తున్న రాష్ట్రం దేశంలో లేదన్నారు. సీఎం కేసీఆర్ దయతో కొమురవెల్లి మల్లన్న దేవాలయం, దుబ్బాక రేకులకుంట ఆలయాలు అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టే ముందు మల్లన్నకు మొక్కి ప్రాజెక్టు కట్టడం ప్రారంభించారని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్, బీజేపీ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించే సమయంలో అడుగడుగునా అడ్డుకున్నారని చెప్పారు. ఆ మల్లన్న చల్లని చూపుతో కాలం కాని కాలంలో రెండు పంటలు పండుతున్నాయని మంత్రి వివరించారు. మండుటెండలలో చెరువులు అలుగు పారుతున్నాయని, దేశంలోని ఏ రాష్ట్రంలో ఇలాంటి సౌకర్యం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఒకప్పుడు ఏ కాలం చూసినా ఎండా కాలమేనని, కానీ టీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఏ కాలం చూసినా వానాకాలంలా కనపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు, కాళేశ్వరం సాగునీళ్లు, సకాలంలో కరెంటును అందిస్తున్నామన్నారు. ఈ మేరకు గొల్లకుర్మలు సంప్రదాయ బద్ధంగా మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో సుడా ఛైర్మన్ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ బాలకృష్ణ, సర్పంచ్ శంకర్, నాయకులు ఎల్లారెడ్డి, వైస్ ఎంపీపీ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

**అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి**





వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు

**సిద్దిపేటరూరల్:** జిల్లాలో జరగనున్న ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఇంటర్మీడియట్ విద్యా చైర్మన్ నవీన్ మిట్టల్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి సమస్యలు వచ్చిన రాష్ట్ర హెల్ప్ లైన్ నంబర్ 040 – 24600110, జిల్లా హెల్ప్ లైన్ నంబర్లు 9985128599, 9949330199లలో సంప్రదించాలన్నారు. మానసిక సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థుల కోసం కమిషనర్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ వారు ఒంటరితనం, ఓటమి భయం, ఒత్తిడి ఆందోళన, వ్యసనాలకు బానిస కావడం, జ్ఞాపక శక్తి సమస్యలు, పరీక్షలంటే భయం ఇలాంటి సమస్యలు ఉంటే టెలీ మానస్ హెల్ప్‌లైన్ నంబర్ 14416 సంప్రదించి సమస్యలను దూరం చేసుకోవాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఇంటర్మీడియట్ పరీక్ష రాసే విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. పరీక్ష సమయానికి గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సూర్యప్రకాష్, డీఆర్వో లక్ష్మీకిరణ్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్, డిస్ట్రిక్ట్ ట్రానోస్పర్టు అధికారి, డీఎం ఆర్టీసీ, పోస్టల్, విద్యుత్, విద్యా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన అవసరం



బహుమతులు అందజేస్తున్న డాక్టర్ రఘురాం

**సిద్దిపేటకమాన్:** విద్యార్థులకు చట్టపరమైన అవగాహన కల్పించడానికి న్యాయ సాక్షరత కార్యక్రమాలను నిర్వహించి, విద్యార్థులను భాగస్వామ్యం చేస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సాక్షరత మిషన్ చైర్మన్ డాక్టర్ రఘురాం అన్నారు. జిల్లా న్యాయ సాక్షరత మిషన్ ఆధ్వర్యంలో జరిగిన మహిళ సాధికారిత స్వాలంబన వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని సిద్దిపేట కోర్టులో సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వారం రోజుల పాటు జరిగిన కార్యక్రమాల్లో విద్యార్థులు కల్చరల్ ప్రోగ్రామ్స్, వ్యాసరచన పోటీల్లో ప్రతిభను ప్రదర్శించారన్నారు. విద్యార్థులు, మహిళలకు బహుమతులు, సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి, న్యాయమూర్తులు సల్మాపాతిమా, శ్రావణి, జనార్దన్‌రెడ్డి, సత్యనారాయణ, ఏఓ మాధవి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

# తప్పుడు సర్వేతోనే పేదలకు అన్యాయం

- చర్చనీయాంశమైన దుబ్బాక 'డబుల్' లొల్లి కథనం
- అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు

**సాక్షి ఎఫెక్ట్..**



ఫిర్యాదు అందజేస్తున్న బీజేపీ నాయకులు

**దుబ్బాకటౌన్:** దుబ్బాక పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు సంబంధించి ఇటీవల విడుదల చేసిన జాబితా తీవ్ర దుమారాన్ని లేపుతోంది. ఆదివారం 'సాక్షి'లో 'దుబ్బాకలో డబుల్ లొల్లి'అనే శీర్షికన ప్రచురితమైన కథనం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దుబ్బాక పట్టణంలోనూ ఈ కథనంపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, కౌన్సిలర్లు ఈ వివరాలను ఎంపీ ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి జాబితాపై రీ సర్వే చేయించి అనర్హులను తొలగించి అర్హులైన పేదలకు ఇళ్లు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. బీజేపీ నాయకులు కథనాన్ని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఈ విషయాన్ని ఉన్నతాధికారులతో మాట్లాడి దీనిపై సమగ్రంగా విచారణ చేపట్టాలని సూచించినట్లు సమాచారం.

**అర్హులకు న్యాయం చేయాలి**

భవంతులు, భూములు, జాగలు, డబ్బులున్నోళ్లకే డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించారని దీంతో పేదలకు అన్యాయం జరిగిందంటూ సోమవారం బీజేపీ నాయకులు, కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి, మచ్చ శ్రీనివాస్, ఎస్ఎన్ చారీ, సుంకోజి ప్రవీణ్ కుమార్, రమణారెడ్డి, సప్తగిరి, బాబీ, బాబుతో పాటు పలువురు నాయకులు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి 'సాక్షి'లో వచ్చిన కథనంతో పాటు ఫిర్యాదును అందజేశారు. అధికారుల తప్పుడు సర్వేతోనే పేదలకు అన్యాయం జరిగిందని ఈ సర్వే చేసిన అధికారులు, దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని మళ్లీ సమగ్రంగా సర్వే చేసి అర్హులకు న్యాయం చేయాలని విన్నవించారు.

# ప్రజావాణికి 90 ఫిర్యాదులు


**స్వీకరించిన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి**



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**సిద్దిపేటరూరల్:** కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా మొత్తం 90 ఫిర్యాదులు వచ్చాయి. వీటిని ప్రజల నుంచి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలతో వచ్చిన ప్రతీ ఒక్కరికి న్యాయం చేసే విధంగా అధికారులు పని చేయాలని ఆయన సూచించారు. వచ్చిన ఫిర్యాదుల్లో భూ సంబంధిత, డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఆసరా పింఛను సమస్యలపై అందజేశారన్నారు. కార్యక్రమంలో డీఆర్వోఓ లక్ష్మీకిరణ్, కలెక్టరేట్ ఏఓ అబ్దుల్ రెహమాన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### భూమిని పంచాయతీకి అప్పగించాలి..



మాది సీఎం దత్తత గ్రామం నరసన్నపేట. మా గ్రామానికి గతేడాది ఫంక్షన్ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ క్రమంలో సర్పంచ్ మాధవిరాజిరెడ్డిని సర్వే నెంబర్ 94లో రెండు ఎకరాల భూమి ఉంది అందులో నిర్మాణం చేయాలని కోరాం. ఆ భూమిలో చేబర్తి గ్రామానికి చెందిన పోయిల కనకయ్య అనే రైతు కబ్జా ఉన్నట్లు తెలిసింది. కనకయ్యను భూమి గూర్చి అడగ్గా భూమికి బదులుగా సర్పంచ్ అతని నుంచి రూ.4 లక్షలు తీసుకున్నట్లు బదులిచ్చాడు. ఈ విషయమై మర్కూక్ తహసీల్దార్‌ను అడగగా ఆ సర్వే నంబర్‌లో పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు నిర్మించినట్లు తప్పుడు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్‌పై, సర్పంచ్‌పై చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూమిని పంచాయతీకి అప్పగించాలి.

–నరసన్నపేట గ్రామస్తులు

### రేషన్‌కార్డు ఇప్పించండి



నాది దుబ్బాక గ్రామం. నా తల్లికి కళ్లు కనబడవు. నాకు రెండు సంవత్సరాల క్రితం పక్షవాతం వచ్చింది. రేషన్‌కార్డులు నాకు రెండు ఉన్నాయంటూ కొన్ని సంవత్సరాల క్రితం కార్డులను తొలగించారు. ఈ విషయమై ఎన్నో సార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎలాగైనా అధికారులు నాకు రేషన్‌కార్డు, ఆసరా పెన్షన్ మంజూరు చేయగలరు.

–కాల్వ రమేశ్, దుబ్బాక

## క్లుప్తంగా

### ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ భీంరెడ్డి

పటాన్‌చెరు టౌన్: ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని..నేరాలను అరికట్ట డంలో వీటి పాత్ర కీలకమని పటాన్‌చెరు డీఎస్పీ భీంరెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం ఐనోల్ గ్రామంలో మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కలసి డీఎస్పీ ప్రారంభించారు. అనంతరం భీంరెడ్డి మాట్లాడుతూ పటాన్‌చెరు సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో క్రైం సీఐ బీసన్న, మండల పంచాయతీ అధికారి హరి శంకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### పేకాట ఆడుతున్నవారిపై కేసు

కోహెడరూరల్(హుస్నాబాద్): పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.15,430 నగదు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని నాగసముద్రాల గ్రామశివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం సోమవారం పోలీసులకు అందింది. దీంతో స్థావరంపై దాడి చేసి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

### నిల్వ ఉంచిన పత్తి దగ్ధం



దుబ్బాక: ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి దగ్ధమైంది. ఈ ఘటన రాయపోల్ మండలం అనాజీపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన అన్నదమ్ములు జెగ్గ కుమార్, జెగ్గ యాదగిరిలు సరైన ధర లేక పత్తిని అమ్మకుండా ఇంటిసమీపంలోని పశువులపాకలో నిల్వ చేశారు. ఆదివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు మంటలంటుకొని సుమారు పది క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది.

### షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె...



దుబ్బాక: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిగుడిసె దగ్ధమైంది. మండల పరిధిలోని సయ్యద్‌నగర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన నజీయా–పఠాన్ గౌస్ దంపతులు రాయి కొడుతూ జీవనం సాగిస్తున్నారు. పూరిగుడిసెలో నివసిస్తున్నారు. సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి గుడిసెకు అంటుకున్నాయి. స్థానికులు మంటలార్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. గుడిసెలో ఉన్న నిత్యావసర సరుకులు, బట్టలు, మంటల్లో పూర్తిగా కాలిపోయాయి.

# గుట్టలన్నీ తోడేస్తున్నారు

**అధికారులకు కనిపించని మట్టిదందా**

కొండపాక(గజ్వేల్): మట్టిదందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వెంచర్లలోకి మట్టితరలింపు యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్టుగా ఉంటున్నారనే ఆరోపణలున్నాయి.

- మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి, కొండపాక గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లోని గుట్టలను తోడేస్తున్నారు.
- కుకునూరుపల్లి, ముద్దాపూర్ గ్రామాల శివారులో తవ్విన కాలువల మట్టిని గజ్వేల్ పట్టణ శివారులో వెలుస్తున్న వెంచర్లలోకి తరలిస్తున్నారు.
- వెలికట్ట, దుద్దెడ, జప్తినాచారం, కొండపాక, తిమ్మారెడ్డిపల్లి, లకుడారం, మేదినీపూర్, కుకునూరుపల్లి గ్రామ శివారులోని వందలాది ఎకరాల్లో వెంచర్లు వెలిశాయి.
- దీంతో సమీప గ్రామాల్లోని ప్రభుత్వభూముల్లో ఉన్న మట్టిపై కొందరు రియల్టర్ల కన్ను పడింది.
- రోజుకు లక్షల రూపాయల్లో దందా సాగుతున్నా రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదన్న ప్రచారం సాగుతోంది.
- తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో ఉన్న గుట్టకు ఇటాచీ, జేసీబీలతో రోజూ వందలాది ట్రిప్పుల మట్టిని తరలించుకుపోతున్నారు.
- నిత్యం రాజీవ్ రహదారిపై ఈ దందా సాగుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.
- ముఖ్యంగా రాత్రి వేళల్లో మట్టి లోడుతో టిప్పర్లు స్పీడుగా వెళుతున్నాయి. దీంతో బైక్‌లపై వెళ్లేవారు భయపడిపోతున్నారు.



కుకునూరుపల్లి శివారులోని కాలువ నుంచి టిప్పర్లతో మట్టిని తరలిస్తున్న దృశ్యం



తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో ప్రభుత్వ భూమిలో ఇలా..

- ఈవిషయమై తహసీల్దార్ రామేశ్వర్‌ను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదన్నారు.





### ఎండలు ముదరకముందే... ఎండిపోతున్నయ్

ఎండలు ఇంకా ముదరకముందే...రైతులకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. బోర్లలో భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో వరి పంట ఎండిపోతున్నది. కొల్చారం మండలపరిధిలోని పచ్చగా ఉండాల్సిన వరి పొలం ఎండిపోవడంతో పశువులను మేపుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

– కొల్చారం(నర్సాపూర్)

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

**సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందగా, ఐదుగురు గాయపడ్డారు.**

**ఆటోను ఢీకొన్న డీసీఎం**



సంఘటన స్థలంలో లక్ష్మి మృతదేహం

అక్కన్నపేట(హుస్నాబాద్): ఆటోను డీసీఎం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. సోమవారం ఎస్‌ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం...యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి హుస్నాబాద్‌కు ఓ డీసీఎం వస్తూ మండల పరిధిలోని రామవరం గ్రామశివారులోని మూలమలుపు వద్ద ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న శ్రీరాముల లక్ష్మి(55) అక్కడికక్కడే మృతి చెందింది. మరో ప్రయాణికురాలు మ్యాన రాజేశ్వరి తలకు తీవ్రగాయాలు అయ్యాయి. డ్రైవర్‌కు కూడా గాయపడ్డాడు. 108లో వీరిని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఓ చావుకు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

**కారు ఢీకొని...**

గజ్వేల్‌రూరల్: రెండు బైక్‌లను ఓ కారు వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. సోమవారం గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మర్కూక్ మండలం పాతూరుకు చెందిన గుర్రాల విజయేందర్(31) పల్సర్‌పై గౌరారం నుంచి స్వగ్రామానికి తిరిగి రాజీవ్ రహదారిపై వస్తున్నాడు. ఇదే క్రమంలో ఎన్సాన్‌పల్లికి చెందిన బొల్లం మనోహర్ కారులో బాబుతో కలిసి హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు వస్తున్న క్రమంలో మార్గమధ్యలోని పాతూరు కూరగాయల మార్కెట్ సమీపంలో బైక్‌పై వెళుతున్న విజయేందర్‌తో పాటు మరో బైక్‌పై వెళుతున్న సయ్యద్ అజీజ్–మదియా దంపతులను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో విజయేందర్‌కు తీవ్ర గాయాలు కాగా, సయ్యద్ అజీజ్, మదియా దంపతులతో పాటు కారులో ఉన్న బాబుకు కూడా గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విజయేందర్ మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.



విజయేందర్(ఫైల్)

**బైక్ అదుపు తప్పి..**

మెదక్ రూరల్: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ...మండల పరిధిలోని రాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు ఉడత యాదగిరి(41) మెదక్‌కు వెళ్లాడు. తిరుగు పయనంలో ఆదివారం రాత్రి స్వగ్రామానికి వస్తుండగా, మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టాడు. దీంతో యాదగిరి తలకు తీవ్ర గాయాలపై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.



యాదగిరి(ఫైల్)

## దారిదోపిడీ

**తుపాకీతో డ్రైవర్‌కు బెదిరింపులు**

పటాన్‌చెరు టౌన్: ఐదుగురు దొంగలు దారిదోపిడీకి పాల్పడ్డారు. సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర సామగ్రితో వెళుతున్న డీసీఎంను అడ్డగించారు. డ్రైవర్‌ను తుపాకీతో బెదిరించి సామగ్రిని అపహరించుకున్నారు. ఈ ఘటన భానూర్–బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమవారం తెల్లవారుజామున జరిగింది. సీఐ వినాయక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఫ్లిప్ కార్ట్ కంపెనీ నుంచి గజ్వేల్‌కు ఓ డీసీఎం వెళుతుండగా, పటాన్‌చెరు మండల పరిధిలోని కర్ధనూర్ సర్వీస్ రోడ్డు వద్ద ఐదుగురు కారులో వచ్చి అడ్డగించారు. డీసీఎం డ్రైవర్‌ను బలవంతంగా తమ వాహనంలో ఎక్కించుకున్నారు. కళ్లకు గంతలు కట్టారు. ఎందుకు ఇలా చేస్తున్నారని అడిగే లోపు తుపాకీతో బెదిరించారు. ఓ గంట తర్వాత కారులోంచి దింపారు. కళ్లకు కట్టిన గంతలు విప్పుకొని చూడగా, సుల్తాన్‌పూర్ ఎగ్జిట్–4 సర్వీస్ రోడ్డు వద్ద ఉన్నాడు. కొద్దిదూరంలో డీసీఎం ఉంది. అక్కడకు వెళ్లి చూడగా, డీసీఎంలో ఉన్న 20 బ్యాగులు కనిపించలేదు. సుమారు 1,78,000 విలువైన వస్తువులు చోరీ అయ్యాయని గుర్తించాడు. వెంటనే బాధితుడు పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాడు. సంఘటన స్థలానికి వెళ్లాక పోలీసులు ఇది భానూర్–బీడీఎల్ ఠాణా పరిధిలోకి వస్తుందని వారికి సమాచారం ఇచ్చారు. డ్రైవర్ ఎండీ సత్తార్ ఫిర్యాదు మేరకు బీడీఎల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



దోపిడీ జరిగింది ఈ డీసీఎంలోనే

### మందు తాగొద్దన్న భార్య.. ఆత్మహత్యకు యత్నించిన భర్త

మెదక్ రూరల్: మద్యం మానేయమని భార్య హెచ్చరించడంతో మనస్తాపానికి లోనైన భర్త పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన మండలపరిధిలోని మంబోజిపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. మంగళిగుట్ట తండాకు చెందిన మాలోతు సూర్య–కవిత దంపతులు కూలీ పనులు చేస్తున్నారు. సూర్య తాగుడుకు బానిసై వచ్చిన డబ్బంతా ఖర్చు చేస్తుండడంతో దంపతుల నడుమ కలహాలు మొదలయ్యాయి. మెదక్ నుంచి ఆదివారం రాత్రి స్వగ్రామానికి వస్తూ కల్లు కోసం మధ్యలో ఆగారు. మద్యం ప్రస్తావన వచ్చి గొడవ జరగ్గా, సూర్య క్షణికావేశంలో వాహనంలోకి తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు మంటలను చల్లార్చి 108కు సమాచారమిచ్చారు. అక్కడి నుంచి మెదక్ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ మోహన్‌రెడ్డి తెలిపారు.

## బీదర్‌లో సరిహద్దు పోలీసుల సమావేశం



సమావేశంలో ఇరు రాష్ట్రాల పోలీసు అధికారులు

జహీరాబాద్: జహీరాబాద్‌కు సమీపంలోని కర్ణాటక పరిధిలోని బీదర్‌లో ఇరు రాష్ట్రాల పోలీసు అధికారులు సోమవారం సమావేశం అయ్యారు. కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్నందున తెలంగాణ – కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ముందస్తుగా పోలీసు చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అంతేకాకుండా సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని మిస్సింగ్ కేసులను ఛేదించాలని, అంతర్‌రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేసేందుకు పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించారు. గుర్తింపునకు నోచుకోని మృతుల కేసులను గుర్తించేందుకు, డ్రగ్స్, మట్కాలను నిర్మూలించేందుకు ఇరు రాష్ట్రాలకు చెందిన పోలీసులు పరస్పరం సహకరించుకోవాలని సమావేశంలో నిర్ణయానికి వచ్చారు. సమావేశంలో బీదర్ ఎస్పీ చెన్నబసవన్న, అదనపు ఎస్పీ మహేశ్, జహీరాబాద్, నారాయణఖేడ్ డీఎస్పీలు వి.రఘు, వెంకట్‌రెడ్డి, జహీరాబాద్ సీఐ తోట భూపతి, సంగారెడ్డి డీఆర్‌సీబీ సీఐ బి.రమేశ్, సంగారెడ్డి, నిజామాబాద్, నాందేడ్, కల్‌బుర్గి జిల్లాలకు చెందిన డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## హత్యకు కుట్ర చేస్తున్నారు.. రక్షణ కల్పించండి

మెదక్ మున్సిపాలిటీ: తనపై హత్యకు కుట్ర చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకొని రక్షణ కల్పించాలని కోరుతూ మెదక్ మున్సిపల్ చైర్మన్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రపాల్ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. నర్సాపూర్‌కు చెందిన రైస్‌మిల్లర్ శ్రీధర్ గుప్తా నిబంధనలకు వ్యతిరేకంగా సివిల్ సప్లైకి బియ్యం సరఫరా చేసేందుకు ప్రయత్నించగా డీఎస్‌ఓకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈవిషయంలో కక్షగట్టిన శ్రీధర్‌గుప్తా బీహార్ కూలీలతో చంపించేందుకు కుట్ర పన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవిషయాన్ని జనవరిలో మరో రైస్‌మిల్లర్ ద్వారా తెలిసినప్పటికీ ఎవరికి ఫిర్యాదు చేయలేదన్నారు. ఇటీవల వదిలిపెట్టే ప్రసక్తే లేదంటూ వాట్సాప్ మెసేజ్ ద్వారా బెదిరిస్తున్నాడని వాపోయారు.



ఎస్పీ కార్యాలయ అధికారికి ఫిర్యాదు చేస్తున్న మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్

### స్నేహితుడితో గొడవపడి...

పటాన్‌చెరుటౌన్: స్నేహితుడితో గొడవ జరిగాక ఒకరు కనిపించకుండాపోయారు. ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం...మండల పరిధిలోని ఇస్నాపూర్ వడ్డెరకాలనీకి చెందిన లక్ష్మణ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 12వ తేదీన మద్యంమత్తులో లక్ష్మణ్, స్నేహితుడు నరసింహులు గొడవపడ్డారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదుగానీ లక్ష్మణ్ కనిపించకుండాపోయాడు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోందని లక్ష్మణ్ తల్లి పోచమ్మ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



లక్ష్మణ్ (ఫైల్)

## బీఎస్‌ఎఫ్ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు



మహేందర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మహేందర్‌రెడ్డి అంతిమయాత్ర

దుబ్బాకరూరల్: మధ్యప్రదేశ్ భోపాల్‌లోని బీఎస్‌ఎఫ్ శిక్షణ కేంద్రం నుంచి జవాన్ బొంగురం మహేందర్‌రెడ్డి(25) మృతదేహం సోమవారం తెల్లవారుజామున స్వగ్రామమైన దుబ్బాక మండలం చీకోడ్ గ్రామానికి చేరుకుంది. ప్రత్యేక వాహనంలో హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆయన అంత్యక్రియలకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. యువకులు జై జవాన్ జై కిసాన్, భారత మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. మహేందర్‌రెడ్డి మృతి పట్ల ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు. బీఎస్‌ఎఫ్ అధికారులు భౌతికకాయంపై జాతీయ జెండాను కప్పి గౌరవ వందనం చేశారు. దుబ్బాక సీఐ కృష్ణ, ఎస్‌ఐ మహేందర్, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ రాంరెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు.



## అదృశ్యమై.. ఆపై చెరువులో శవమై

**హత్య చేసినట్టు అనుమానం**

శివ్వంపేట(నర్సాపూర్): రెండురోజుల క్రితం కనిపించకుండాపోయిన ఓ వ్యక్తి చెరువులో శవమై తేలాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ మండలం అల్లాపూర్ గ్రామానికి చెందిన మన్నే ఆంజనేయులు(45) కుటుంబం గజ్వేల్‌లో నివాసముంటోంది. దొంతిలోని ఓ ఫామ్ హౌస్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి నుంచి ఆంజనేయులు కనిపించకపోవడం, సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండడంతో ఆదివారం భార్య పద్మ శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సోమవారం దొంతి గ్రామంలోని కుందలమ్మ చెరువులో ఆంజనేయులు మృతదేహం వెలుగుచూసింది. తలకు బలమైన గాయంతో పాటు శరీరంపై పలు చోట్ల గాయాలు ఉన్నాయి. ఆంజనేయులుని హత్యచేసి చెరువులో పడేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. అనుమానితుల వివరాలు ఆంజనేయులు కుటుంబసభ్యులు పోలీసులకు తెలిపారు. సంఘటన స్థలాన్ని తూప్రాన్ సీఐ శ్రీధర్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మృతుడు భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపారు.



ఆంజనేయులు(ఫైల్)

## గుండెపోటుతో బీజేపీ నేత మృతి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలపరిధిలోని అయినాపూర్‌కు చెందిన బీజేపీనేత గన్నెబోయిన నర్సింహులు(48) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు దండ్యాల వెంకట్‌రెడ్డి, గ్రామసర్పంచ్ చెరుకు రమణారెడ్డి, వైస్‌ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డిలు సంతాపం వ్యక్తం చేశారు.



నర్సింహులు (ఫైల్)

## కస్టమర్ కేర్ అని కాల్ చేస్తే...

**రూ.1,66,128 మాయం**

మద్దూరు(హుస్నాబాద్): గూగుల్ వెబ్‌సైట్‌లో ఓ కస్టమర్ కేర్ నంబరు తీసుకొని కాల్ చేసి ఓ ఉపాధ్యాయుడు డబ్బు పోగొట్టుకున్నాడు. ఎస్‌ఐ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం..మండలపరిధిలోని మర్మాముల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇద్దగిరి సిద్దయ్య సెల్‌ఫోన్‌లో వాట్సాప్ పని చేయలేదు. గూగుల్ వెబ్‌సైట్‌తో వెతికి ఓ కస్టమర్ నంబరుకు కాల్ చేశాడు. అవతలి వ్యక్తి మాయమాటలు నమ్మి ఫోన్‌లో ఏనీ డెస్క్ యాప్ ఇన్‌స్టాల్ చేశాడు. దీంతో ఆయన అకౌంట్ నుంచి రూ.1,66,128 మాయమయ్యాయి. దీంతో తాను మోసపోయానని భావించిన ఆ టీచర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అపరిచిత కాల్స్.. అప్రమత్తంగా ఉండాలి

**సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత**

సిద్దిపేటకమాన్: అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సిద్దిపేట పోలీస్‌కమిషనర్ శ్వేత సూచించారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. సోమవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన సైబర్ నేరాల వివరాలు ఆమె తెలిపారు.



- సిద్దిపేట త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి అమెజాన్‌లో సూపర్‌వైజర్ ఉద్యోగం ఉందని, ఇందుకుగాను కొంత మొత్తం డబ్బు చెల్లించాలంటూ గుర్తు తెలియని వ్యక్తి నమ్మించాడు. దీంతో ఆయనకు రూ.1550 ఆన్‌లైన్‌లో పంపించాడు. తర్వాత ఆ నంబరుకు ఫోన్ చేయగా ఎలాంటి స్పందన లేదు. దీంతో తాను మోసపోయినట్టు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నంబరు 1930కు బాధితుడు ఫిర్యాదు చేశాడు.
- గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని ఒకరు ఫోన్ చేసి మీకు లోన్ అవసరం ఉందా అని అడిగాడు. దీంతో బాధితుడు లోన్ అవసరమని చెప్పగా, కొన్ని డాక్యుమెంట్లు పంపిస్తే...తమకు సంబంధించిన వ్యక్తి ప్రత్యక్షంగా వచ్చి వెరిఫికేషన్ చేసి లోన్ ఇస్తామని నమ్మించాడు. ఆ తర్వాత బాధితుడు పంపిన ఆ అడ్రస్‌కు లోన్ వెరిఫికేషన్ కోసమంటూ ఓ వ్యక్తి వచ్చాడు. ప్రాసెసింగ్ చార్జీల నిమిత్తం కొంత డబ్బు చెల్లించాలన్నాడు. దీంతో బాధితుడు కొంత నగదు, మరి కొంత ఆన్‌లైన్‌లో మొత్తంగా రూ.33,800 కోల్పోయాడు.
- బెజ్జంకి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో రెడ్‌మీ ఫోన్ ఆఫర్‌లో తక్కువ ధరకు వస్తుందనే యాడ్ చూశాడు. ఆ లింకుపై క్లిక్ చేసి ఆన్‌లైన్‌లో రూ.1,999 చెల్లించాడు. తర్వాత ఫోన్ చేయగా స్పందన లేదు.
- గజ్వేల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి వాట్సాప్‌నకు బిట్‌కాయిన్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే లాభాలు వస్తాయని గుర్తు తెలియని వ్యక్తి మెసేజ్ చేశాడు. అది నమ్మిన బాధితుడు రూ.1,45,000 పెట్టుబడి పెట్టాడు. కొంత మొత్తం లాభం వచ్చినట్టుగా చూపించాడు. కానీ ఆ డబ్బులు విత్‌డ్రా చేసుకోవడానికి వీలులేకుండా ఉంది. దీంతో సైబర్ నేరం జరిగినట్టుగా గుర్తించి బాధితుడు 1930 నంబరుకు ఫిర్యాదు చేయగా, పోలీసులు రూ.50వేలు ఫ్రీజ్ చేశారు.
- సిద్దిపేట పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తి ఓ లింకు పంపాడు. బాధితుడు అది ఓపెన్ చేయగా రూ.659 పోగొట్టుకున్నాడు. వెంటనే బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబరుకు ఫిర్యాదు చేయగా రూ.659 ఫ్రీజ్ చేశారు.